
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025





వామ్మో జూన్..



- 'ఇంటి బడ్జెట్'పై తల్లిదండ్రుల్లో దడ..
- మధ్యతరగతి జీవులకు స్కూళ్ల భయం
- డొనేషన్లు, ట్యూషన్‌ఫీజులు, బ్యాగులు, పుస్తకాల భారం
- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత
- ఫీజుల నియంత్రణలో కొరవడిన అజమాయిషీ
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 535, ప్రైవేటు పాఠశాలలు 120
- సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు
- జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు
- జూన్ 6 నుంచి బడిబాట

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పిల్లల చదువులకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగంతో ఉన్నత స్థితికి చేరాలని ఆర్థికంగా ఎంత భారమైనా భరిస్తారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు అప్పులు చేయడానికి కూడా వెనకాడరు. అందుకే జూన్ మాసం వచ్చిందంటే వారిలో టెన్షన్ మొదలవుతుంది. ఒకటో తారీఖు అంటే ప్రతినెలా సామాన్య కుటుంబాలకు ఇబ్బందిగానే ఉంటున్నా జూన్ మాసంలో మాత్రం ఇంకాస్త భయాన్ని కలిగిస్తుంది. ఇంటి బడ్జెట్‌కు తల్లిదండ్రుల కసరత్తు మొదలైంది. జూన్ మాసం వస్తుందంటేనే తల్లిదండ్రులు హడలిపోతారు. ప్రతి కుటుంబంపై జూన్ మాసంలో రూ 50 వేల నుంచి రూ లక్ష వరకు బడి ఖర్చులు ఉంటాయి. మరో 15 రోజులు మాత్రమే పాఠశాలలకు సెలవులు మిగిలి ఉన్నాయి. పాఠశాలలు తెరుచుకోవడానికి ముందే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ సహా కొనుగోలు చేయడంతో పాటు ఫీజుల మోతను ఎదుర్కోవడానికి తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను తలకిందులు చేస్తుంది. కళాశాలలు, పాఠశాలల్లో ఫీజులు కూడా భారీగా పెంచారు. ప్రభుత్వం ఈసారి సకాలంలోనే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించడానికి చర్యలు చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్వశక్తి సంఘాల మహిళల ద్వారా యూనిఫాంలను వేగంగా కుట్టిస్తున్నారు. యూనిఫాంలకు సంబంధించిన బట్ట కూడా సిరిసిల్ల మరమగ్గాలపైనే ఉత్పత్తి అయ్యింది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం కొన్ని దుకాణాల్లో పుస్తకాల అమ్మకాలు మొదలు పెట్టారు. ఈసారి పుస్తకాల ధరలు స్వల్పంగానే పెరిగినా, సామాన్యుడు కొనలేని పరిస్థితి మాత్రం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు అందించినా కానీ వీటికి సంబంధించిన క్వశ్చన్ బ్యాంక్‌లు, ఇతర సామగ్రి కొనుగోలుకు మధ్యతరగతి కుటుంబాలు డబ్బులు సమకూర్చుకోవడానికి హడలిపోతున్నారు. స్కూల్ ఫీజులు మాట వింటేనే భయపడిపోతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్‌కు వెళ్లే పిల్లలు ఉంటే బంగారం లాంటి వస్తువులు తాకట్టు పెట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు అడ్మిషన్లు, పుస్తకాలు అయిపోతాయంటూ ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న ప్రచారం కూడా అంతాఇంతా కాదు. వేసవి పోయి వాతావరణం చల్లబడుతుందనే సంతోషం కంటే జూన్ మాసం నుంచి ఎలా గట్టెక్కాలో తెలియని పరిస్థితి పేద కుటుంబాల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పవర్‌లూం నేత కుటుంబాలు, వ్యవసాయ కుటుంబాలు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలని ఆరాట పడుతున్నారు. ఇందుకోసం ప్రైవేటు విద్యపై మొగ్గు చూపుతుండడంతో మోయలేని భారంగానే మారింది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వివిధ రకాల ఫీజుల పేరుతో వసూలు చేస్తూ మానసిక క్షోభకు కూడా గురిచేస్తున్నారు. అయినప్పటికీ పిల్లల తల్లిదండ్రులు పడుతున్న ఆరాటం, ఖర్చుల ఇబ్బందులు చెప్పలేనిది కాదు. ఏ పాఠశాలలో, ఏ కళాశాలలో చేర్పించాలి, ఏ విద్యా సంస్థలకు ఎక్కువ ర్యాంక్‌లు వచ్చాయి, ఎంత ఖర్చు అవుతుంది.. అనే విషయాలపై

మిగతా 8లో





కరీంనగర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

అభివృద్ధికి కలిసి పని చేస్తాం

- ఉమ్మడి జిల్లాలో రూ. 2,782 కోట్ల విలువ చేసే ధాన్యం కొన్నాం
- ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు 7లో

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నామని ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం పండించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు కీలక బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకున్నా.. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా నిలిపామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువలు, తూములు, ఓటీలకు మరమ్మతు చేయాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పలు అంశాలపై మాట్లాడారు.

- కరీంనగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- ఘనంగా ఆరుద్ర నక్షత్రోత్సవం



ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న అర్చకులు 6

కరోనా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు...

- డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. గురువారం సిరిసిల్లలో రజిత మాట్లాడుతూ సాధారణ జలుబు, దగ్గు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంట్లోనే విడిగాఉండాలని సూచించారు. ప్రయాణాల్లో జన సమూహాల్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా మాస్కులు వాడాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కొవిడ్ కేసుల ప్రభావితప్రాంతాల నుంచి వచ్చిన వారు అనుమానిత లక్షణాలు కనిపించినా నిర్ధారణకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు, పిల్లలు, గర్భిణుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు కరోనా విషయంలో భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రధాన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు 8

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో జిల్లా ఫస్ట్..

- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో కలెక్టర్‌ను అభినందించిన మంత్రులు

సిరిసిల్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోల్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, ఖరీఫ్ సాగు ఇతర అభివృద్ధి పనులపై జరిగిన సమీక్ష సమావేశంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పాల్గొని వివిధ అంశాలను వివరించారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతోపాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ఉమ్మడి జిల్లాలో పలు పనులపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో జిల్లా ను ప్రథమ స్థానంలో నిలిపిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, అధికారులను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అభినందించారు. జిల్లాకు మంజూరైన 7,862ఇళ్లకు 7,808 ఇళ్ల ప్రొసీడింగ్ ఆర్డర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఒకటి,రెండు ఫేజ్‌లకు సంబంధించి వేములవాడ నియోజకవర్గంలో 2,575ఇళ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో 3,608ఇళ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లిలో 820 ఇళ్లు, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో మొదటి ఫేజ్‌లో 42ఇళ్ల పత్రాలు అందించగా, ఫేజ్‌లో 2లో763 పత్రాలు ఇవ్వనున్నారు. ప్రొసీడింగ్‌లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలు అందజేశారు. జిల్లాలో మొత్తం మొదటి విడతలో 439 ఇళ్లు మంజూరుచేయగా 135ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్‌ను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



ఆలయ అభివృద్ధిపై న్యాయపరంగా ముందుకు..

- రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధిపై స్పష్టమైన వైఖరిని తెలుపకుంటే న్యాయపరంగా ముందుకు వెళతామని రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వర్ గెస్ట్‌హౌస్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నామని అనడం అవివేకం అని, దేవాలయం అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్లాన్ లేకుండానే ఆలయాన్ని మూసివేస్తామని అనడం సమంజసం కాదన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటామని ముందుగానే కోర్టు ద్వారా కెవిట్ నోటీసు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో దేవాలయం లోపలి దేవత విగ్రహాలను ముట్టుకుంటే ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో రాపెల్లి శ్రీధర్, అక్కపెల్లి వివేకొరెడ్డి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

సిరిసిల్ల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఉపాధ్యాయుల కోసం చేపట్టిన శిక్షణ తరగతులను అన్ని వర్గాల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్య పరిశీలన మండలి డైరెక్టర్ గాజర్ల రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ తరగతులతో పాటు సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల కేంద్రాలను గురువారం డైరెక్టర్ గాజర్ల రమేష్ సందర్శించారు. శిక్షణ కార్యక్రమాల్లో ఉత్తమంగా నిలిచిన పావని, రవీందర్, శ్రీలత,మనోహర్, వేణు గోపాల్‌రావు, శ్రీరాం మనోహర్, పరకాల రవీందర్, అబ్దుల్ రవూఫ్‌లను సన్మానించారు. జిల్లా సైన్స్‌అధికారి పాముల దేవయ్య, కోఆర్డినేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల వెంకంపేట పాఠశాలలో మాట్లాడుతున్న డైరెక్టర్ రమేష్

యాజమానులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలలో కూలి పెంచే విధంగా పాలిస్టర్ యాజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లో గురువారం కార్మికశాఖ భవనంలో డీసీఎల్‌ను కలిసి సీఐటీయూ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. కలెక్టర్‌తో పాటు కార్మిక శాఖ అధికారులు పాలిస్టర్ యాజమానులతో చర్చలు జరిపి కూలి పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

తంగళ్లపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు, నాయకులు ముగ్గు పోసి ప్రారంభించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా అహ్మద్ అలీ బేగ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సత్తు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సమీర్, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క శేఖర్, జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు సుద్దాల శ్రీనివాస్, కరుణాకర్, పొన్నం లక్ష్మణ్ గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని మామిడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు తహసీల్దార్ వరలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా ముగ్గుపోసి ప్రారంభించాఉ. కోనరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి, ఏఈ సాయిప్రియ, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య గురువారం భూమి పూజ చేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ చైతన్య, పంచాయతీ కార్యదర్శి జాఫర్, నాయకులు రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, గౌస్, బాబు, వెంకటేశ్, నారాయణ రెడ్డి, గోపాల్, రాజయ్య, బాలయ్య, మహేందర్, మల్లారెడ్డి, పర్శరాములు, బాల్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోస్తున్న నాయకులు, అధికారులు



పరారైన ఖైదీ కోసం తీవ్ర గాలింపు

● నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు
● విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ


జున్ను ప్రసాద్(ఫైల్)

జగిత్యాల క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కోర్టు నుంచి మంగళవారం పారిపోయిన జున్ను ప్రసాద్ అనే ఖైదీని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. కొడిమ్యాల ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుడు విదేశాలకు పారిపోకుండా పోలీస్ శాఖ లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. అయితే ప్రసాద్ జగిత్యాల నుంచి తప్పించుకుని ముంబై వైపు పారిపోయినట్లుగా పోలీస్ శాఖ భావించి ఆ దిశగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జున్ను ప్రసాద్ ఉపాధి కోసం 10 సంవత్సరాల క్రితం మస్కట్, దుబాయ్ ప్రాంతాలకు వెళ్లాడు. అనంతరం కొద్దికాలం ఫాస్టర్‌గా పనిచేశాడు. నాలుగేళ్ల క్రితం జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతంలో ఓ చిన్న గదిని అద్దెకు తీసుకుని గల్ఫ్ బ్రోకర్‌గా అవతారమెత్తాడు. పెగడపల్లి, కొడిమ్యాల, మల్యాల, జగిత్యాల తదితర ప్రాంతాలకు చెందిన 50 మంది యువకులకు గల్ఫ్‌కు పంపిస్తానని చెప్పి పాస్‌పోర్టులు తీసుకుని లక్షల రూపాయలు వసూలు చేశాడు. అనంతరం గల్ఫ్ దేశాలకు పంపక పోవడంతో పలువురు ఫిర్యాదుతో పెగడపల్లి, కొడిమ్యాల, జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రసాద్‌పై కేసులు నమోదయ్యాయి. దీంతో పెగడపల్లి పోలీసులు ఈ నెల7న ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల కోర్టులో రిమాండ్ ఖైదీగా ఉన్న ప్రసాద్‌పై కొడిమ్యాల పోలీసులు పీటీ వారెంట్ తీసుకుని మంగళవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి కేసు విచారించి నిందితుడైన ప్రసాద్‌కు రిమాండ్ విధించాడు. దీంతో నిందితుడిని జైలు తరలించేందుకు గాను రిమాండ్ వారెంట్ తీసుకునేందుకు న్యాయస్థానం లోపలికి వెళ్లిన కోర్టు కానిస్టేబుల్ సాగర్ కళ్లుగప్పి ప్రసాద్ పారిపోయాడు. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలు నిజామాబాద్, హైదరాబాద్, ముంబై, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపడుతున్నాయి.

మహిళ అనుమానాస్పద మృతి

చిగురుమామిడి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన కంది పుష్ప(50) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ట్రైనీ ఎస్సై జగదీశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వెసుకొని మృతి చెందింది. ఈసంఘటనపై మృతురాలి బంధువులు అనేక అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి బంధువు కంది శివరంజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపినారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య


మృతిచెందిన రాంచందర్

వీణవంక, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టేకు రాంచందర్(40) ఉరివేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాంచందర్ కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యలతో తీవ్రమానసిక ఒత్తిడికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య టేకు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

● ఆస్తి అమ్మి అప్పు తీర్చుతానన్న తండ్రిని ఇనుపరాడ్డుతో మోది హత్య


అంగడి నర్సయ్య (ఫైల్)

మేడిపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండలకేంద్రంలో అంగడి నర్సయ్య(56) అనేవ్యక్తిని గురువారం కొడుకు ఇనుపరాడ్డుతో మోది అత్యంత దారుణంగా హత్య చేశాడు. నర్సయ్యకు రూ.20లక్షల వరకు అప్పులు కాగా ఆస్తిని అమ్మి అప్పులు తీరుస్తానని కొడుకు వెంకటేష్‌తో తరచూ చెప్పేవాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్యా కొన్నినెలలుగా గొడవలు జరుగుతున్నాయి. అంగడి నర్సయ్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా అక్కడ పని లేక కొన్నేళ్ల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చాడు. అనంతరం తనకున్న భూములో వ్యవసాయం చేస్తుండగా అప్పులు తీరక పోగా మరింత పెరిగాయి. దాంతో తనకున్న వ్యవసాయ భూమి, ఇల్లు అమ్మి అప్పులు తీర్చుతానని కొడుకు నర్సయ్య చెప్పాడు. ఉన్న ఆస్తిని అమ్మితే ఎలా బతకాలని గురువారం కొడుకు తండ్రితో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవ ముదిరి తీవ్ర ఆవేశానికి గురైన వెంకటేష్ తన తండ్రి తలపై ఇనుపరాడ్డుతో బాధడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సురేష్ తెలిపారు.

ప్రాణాలను చిదిమేస్తున్న పొగాకు





● గుట్కా, సిగరెట్, బీడీలతో క్యాన్సర్
● రేపు పొగాకు వ్యతిరేక దినం

కరీంనగర్ క్రైం/జగిత్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులైన గుట్కా, జర్దా, సిగరెట్, బీడి వంటివి సేవించడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఎనిమిది మిలియన్ల ప్రజలు మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భారతదేశంలో ప్రతి సంవత్సరం 14 లక్షల ప్రజలు పొగాకు ప్రభావంతో మృతి చెందుతున్నారు. క్యాన్సర్ బాధితుల్లో 50శాతంపైగా పొగాకు సంబంధంతోనే ఉన్నట్లు ఒక సర్వేలో వెల్లడైంది. గతంలో పోలీసులు తీసుకున్న చర్యలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా వరకు గుట్కా దందా అదుపులోకి వచ్చింది. ఈ దందాకు రాజకీయ నాయకులు మద్దతు ఇస్తుండటంతో పక్క జిల్లాల నుంచి గుట్కాలు తెస్తూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. నెలకు కోట్లలో అక్రమ సంపాదన వస్తుండటంతో ఈ చీకటిదందాను మానుకోలేక పోతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడంపై నిషేధం

బహిరంగ ధూమపానం నేరమని సీవోటీపీఏ (సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్) 2003లో అమల్లో వచ్చింది. ఇందులో సెక్షన్ నాలుగు కింద పబ్లిక్ స్థలాల్లో పొగ తాగొద్దు. సెక్షన్ 6 కింద పాఠశాలల ప్రాంతంలో 400 యార్డ్స్ లోపల విక్రయించవద్దు, 18 సంవత్సరాల్లోపు వారికి విక్రయించడం నిషేధం. బస్టాండ్లు, పార్కులు, రోడ్లపై, సినిమా థియేటర్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే చట్టరీత్యా నేరంగా పరిగణించాల్సి ఉంటుంది. వీరికి జరిమానా విధించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో ఇప్పటి వరకు అంతంతమాత్రంగానే కేసులు నమోదయ్యాయి. చట్టం తీసుకువచ్చిన కొత్తలో పోలీసులు టార్గెట్లను నింపుకోవడానికి కొన్ని కేసులు నమోదు చేసి ఆ తరువాత మరచిపోయారు. ప్రతి యేట మే 31న 'నో టొబాకో డే' కార్యక్రమాలు నిర్వహించటం తప్ప చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడం లేదనే విమర్శలున్నాయి.

నో టొబాకో డే నేపథ్యం...

1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31న నో టొబాకో డేగా డిక్లేర్ చేసింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచంలో మనుషులకు హాని తలపెట్టే అత్యంత ప్రమాదకరమైనది పొగాకేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ప్రపంచంలోని 29 దేశాల్లో టొబాకో ఉత్పత్తులపై ప్రచారాన్ని నిషేధించాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై పరిశ్రమల వ్యూహాలను బహిర్గతం చేయడాన్ని ఈ సంవత్సరం థీమ్‌గా పెట్టుకున్నారు.



హానికరమైన పొగాకును మానుకోవాలి

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



ఆరోగ్యానికి హానికరమైన పొగాకును మానుకోవడం మంచిది. చాలా మంది సిగరెట్ మానేయడం కష్టంగా ఉంటుందటారు. గట్టి నిర్ణయం తీసుకుంటే మానేయడం కష్టమేమీ కాదు. పొగాకు కాల్చడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఒక్కొక్కసారి ప్రాణాంతకమయ్యే ప్రమాదం పొంచి ఉంది. వైద్యుల సలహాలు పాటించి ఆరోగ్య రక్షణకు అవసరమైన పనులు చేయాలి. దీనిపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.



అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

ఎల్లారెడ్డిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో ఈనెల 27న దర్వేశ్ అలీ గుట్ట దర్గా ప్రాంతంలోని అక్రమ కట్టడం కూల్చివేత, బీజేపీ నాయకుల సందర్శన నేపథ్యంలో నెలకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన మల్లేశంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఇరువర్గాల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. వెంట ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఉన్నారు.

నక్కదాడిలో యువకుడికి గాయాలు

చందుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై నక్క దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం ఏనగల్-జోగాపూర్ గ్రామాల మధ్య గురువారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని జోగాపూర్‌కు చెందిన చింతం అనిల్ యువకుడు గొర్రెలను మేపుతుండగా వెనుక నుంచి వచ్చిన నక్క దాడి చేసి కుడి చేతిని గాయపరిచింది. అనిల్‌ను చికిత్స నిమిత్తం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామశివారులోని మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆర్ఐ శ్రవణ్ గురువారం తెలిపారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రవణ్ హెచ్చరించారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో చెలరేగిన మంటలు

సిరిసిల్ల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరులోని 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. సకాలంలో సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. సబ్ స్టేషన్‌లోని 132/33 కేవీ ఫీడర్‌లో మంటలు వచ్చి కాలిపోయింది. దీంతో సిరిసిల్ల పట్టణంలో అరగంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని కాలిపోయిన పీటీకి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

'దోస్త్'లో మొదటివిడత సీట్ల కేటాయింపు పూర్తి

● డిగ్రీలో మొత్తం సీట్లు 36,540
● మొదటివిడతలో కేటాయించినవి 5,931

గణేశ్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): దోస్త్ మొదటివిడత సీట్లలో ఉన్నత విద్యామండలి శాతవాహన విశ్వవిద్యాలయంలో పరిధిలో మొత్తం 36,540 సీట్లకు గాను మొదటి విడతలో 5,931సీట్లను కేటాయించింది. ఇంకా 30,609సీట్లు ఖాళీగా ఉన్నాయని శాతవాహన విశ్వవిద్యాలయ దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒకప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 13ప్రభుత్వ కళాశాలలో 297మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. మూడు ప్రభుత్వ అటానమస్ డిగ్రీకళాశాలలో 2,047, 60ప్రైవేటు కళాశాలలో 3,587 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. మొదటివిడతలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ ఆరోతేదీ లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీట్లు రిజర్వ్ చేసుకోవాలని లేనిపక్షంలో సీటు రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందని తెలిపారు.

ఆర్టీసీ జోనల్ హాస్పిటల్‌లో స్కానింగ్ సేవలు

భగత్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ హాస్పిటల్‌లో స్కానింగ్ పరీక్షలను ప్రారంభించారు. కన్సల్టింగ్ డాక్టర్ మంగళ, గురువారాల్లో ఉదయం అందుబాటులో ఉంటారని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్‌లోని ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబీకులు, విశ్రాంతఉద్యోగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కరీంనగర్- నిజామాబాద్ మధ్య ఈ-డీలక్స్ బస్సులు

భగత్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-నిజామాబాద్ మధ్య ఈ-డీలక్స్ బస్సులను ప్రారంభించామని కరీంనగర్-2 డిపో మేనేజర్ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆరు ఈ-డీలక్స్ బస్సులను కరీంనగర్ నుంచి నిజామాబాద్ మధ్య ఉదయం నాలుగు గంటల నుంచి 6.30వరకు, అలాగే మధ్యాహ్నం ఒంటిగంటనుంచి 3.30 వరకు ప్రతీ 30నిమిషాలకు ఒకబస్సు ఉంటుందని వివరించారు.బస్సుల్లో పదిశాతం రాయితీతో పెద్దలకుఒక్కరికి 230రూపాయలు, పిల్లలకు130రూపాయల టికెట్ ఉంటుందని తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రయాణాకులు వినియోగించుకో వాలని కోరారు.

డిగ్రీ పరీక్షలో ఏడుగురు విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండోసెమిస్టర్ పరీక్షలో గురువారం ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్టు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణఅధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్ ఒక ప్రకనటలో తెలిపారు.ప్రభుత్వడిగ్రీ కళాశాల గంబీరావుపేటలో ఆరుగురు, మాహర్షి డిగ్రీ కాలేజ్ గోదవారిఖనిలో ఒకరు, మొత్తం ఏడుగురిని డీబార్ చేసినట్టు తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● స్వామివారి సేవలో మాజీ ఎన్నికల కమిషనర్ ● ఆలయంలో ఘనంగా ఆరుద్ర నక్షత్రోత్సవం


మాజీ ఎన్నికల కమిషనర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులరద్దీ కొనసాగుతోంది. గురువారం తెల్లవారు జామును నుంచి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. గురువారం 50వేల మంది వరకు భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఆలయంలో ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా అర్చకులు శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సాయంత్రం సదస్యం నిర్వహించారు.

రాజన్నసేవలో రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ సి పార్థసారథి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం స్వామివారి కల్యాణ మండ పంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు.


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

ఆస్తి పంపకం విషయంలో వివాదం

● కత్తితో తండ్రీకొడుకుల పరస్పర దాడులు ● ఇద్దరికీ గాయాలు

కోరుట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో ఆస్తిపంపకం విషయంలో తండ్రీకొడుకుల మధ్య గురువారం జరిగిన వివాదం పరస్పరం కత్తిపోట్లకు దారితీసింది. ఈఘటనలో తండ్రి రాచకొండ దేవభూమయ్యకు, కుమారుడు నవీన్‌కు గాయాలయ్యాయి. కోరుట్లకు చెందిన రాచకొండ దేవభూమయ్యకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండోకుమారుడు నవీన్ తనకు వాటాగా వచ్చే ఆస్తిపంచాలని తండ్రి దేవ భూమయ్యతో తరుచుగా గొడవ పడేవాడు. ఈ క్రమంలో గురువారం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ తనవెంట తెచ్చుకున్న కత్తితో తండ్రిపై దాడి చేయడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన తండ్రి అదేకత్తిని లాక్కొని కొడుకుపై దాడిచేశాడు. దీంతో కొడుకు నవీన్ మెడ వద్ద తీవ్రగాయలు కాగా తండ్రి దేవ భూమయ్య చేతికి గాయం కావడంతో కుటుంబసభ్యులు ఇద్దరినీ జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా నవీన్‌ఆన్‌లైన్ గేములతోపాటు జూదం ఆడిలక్షలు రూపాయలు నష్టపోయాడని, ఉన్నఆస్తులు అమ్మడానికి యత్నిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడికి దిగాడని తండ్రి దేవ భూమయ్య ఆరోపించాడు. దాడి ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


గాయపడిన రాచకొండ నవీన్, దేవ భూమయ్య

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన అనాసి సాయిరాం(27) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సాయిరాంకు కొంత కాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. సంబంధం కుదరకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 23న పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ ఐ స్వామి తెలిపారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా పెరిగిన వరద

● ఎగువ నుంచి 3,310 క్యూసెక్కులు నీరు రాక

జగిత్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం స్వల్పంగా వరదనీరు రావడం పెరిగింది. ఎస్సారెస్పీలోకి 3,310క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టునీటినిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 12.556 టీఎంసీల నీరునిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 7.410 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 652క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

ఇదిలా ఉండగా 2024 జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 293.023 టీఎం సీల వరద నీరు వచ్చి చేరగా, 287.867 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కిమ్మసారం సురేశ్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ గురువారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్‌తీర్పు ఇచ్చారు. సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ వివరాలప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సిద్దార్థ నగర్‌కు చెందిన ఏడవెల్లి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగ సందర్భంగా అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి జనవరి 11, 2025న స్వగ్రామానికి వెళ్లాడు. మరునాడే ఇంటి ఓనర్‌చూసి తాళం లేదని శ్రీనివాస్‌కు చెప్పడంతో వెంటనే స్వగ్రామం నుంచి సిరిసిల్లకువచ్చేశాడు. ఇంటితాళం పగులగొట్టి ఇంట్లోని వస్తువులను చిందర వందర చేసి బీరువా పగులగొట్టి అందులో ఉన్న రూ.70వేలు, రెండు తులాల వెండి మొలతాడును దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితుడుశ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటిఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదుచేసి నిందితుడైన సురేశ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టు మానిటరింగ్ ఆర్ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారు.

పురుమల్ల శ్రీనివాస్ అనుచరుల ముందస్తు అరెస్టు


పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కరీంనగర్ క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్‌పార్టీ నుంచి సస్పెండ్ అయిన కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ అనుచరులను గురువారం ఉదయం కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు ముందరస్తు అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు రాష్ట్ర భారీనీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్‌జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో దాదాపు 28మంది ఉదయం 10గంటల సమయంలో కలెక్టరేట్ వద్ద వేచి ఉన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమవగా పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి మూడో ఠాణాకు తరలించారు. మంత్రులు సమావేశం ముగించుకుని హైదరాబాద్ వెళ్లిన తరువాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్‌జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్‌ఫహద్ మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా పని చేసిన పురుమల్ల శ్రీనివాస్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించేందుకు తాము కలెక్టరేట్ వద్దకు వచ్చామన్నారు. కానీ పోలీసులు మంత్రిని కలవనీయకుండా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారన్నారు. తాము పురుమల్ల శ్రీనివాస్‌పై నమ్మకంతో కాంగ్రెస్‌పార్టీలో చేరామని తెలిపారు. శ్రీనివాస్ సస్పెన్షన్ ఎత్తివేస్తే తాము కలిసికట్టుగా త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తామని తెలిపారు.

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

▸ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మీకాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

▸ భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఇందులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటెనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డోమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

▸ మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడుత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.



సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



ఎండీ సర్దార్ (ఫైల్)

అభివృద్ధికి కలిసి పని చేస్తాం

- ఉమ్మడి జిల్లాలో రూ. 2,782 కోట్ల విలువ చేసే వరిధాన్యం కొన్నాం
- ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కరీంనగర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

కరీంనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా అభివృద్ధికి తామంతా కలిసి పనిచేస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పాత్రను నిర్వహిస్తున్నారని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజీలలో నీరు నిలిపే పరిస్థితులు లేకున్నా ఉమ్మడి జిల్లా పరిధిలోనే కాకుండా రాష్ట్రంలో కూడా గణనీయమైన వరి ఉత్పత్తి సాధించామని ఆయన చెప్పారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఈ రబీ సీజన్‌లో 13.55 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి రైతులకు 2782 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రంలో 285 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించామని, దేశం లోనే తెలంగాణ వరి ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి అన్నారు. యాసంగి సీజన్‌లో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామని, మే 28 నాటికి 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 12,922 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వను పెంచుతాం..



వానాకాలంలో ఎస్సారెస్పీ నీటి విడుదల విషయంలో ప్రణాళిక సిద్ధం చేయడంలో స్థానిక ఎంపీలను, ఎమ్మెల్యేలను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఇసుక మేటల కారణంగా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, ఆధునిక పద్ధతుల్లో వాటిని తొలగించి నీటి నిల్వను పెంచుతామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలువలు, తూములు, ఓటీల మరమ్మతు పనులను త్వరలోనే పూర్తి చేయాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. సింగరేణి భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాళ్ల వాగు ఎత్తిపోతల పథకాన్ని వారం రోజుల్లో ప్రారంభిస్తామని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయ కట్టుకు సాగునీరందించే ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు. యాసంగిలో పండించిన సన్నరకాల వడ్లను మిల్లింగ్ చేస్తే విరిగే అవకాశాలున్నందున బాయిల్డ్ రైస్‌గా మార్చేందుకు అనుమతివ్వాలని రైస్ మిల్లర్లు కోరుతున్నారని, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోది స్తుందని మంత్రి చెప్పారు. నీటి పారుదల శాఖ పరిధిలో 1,100 మంది ఇంజనీర్లను, 1,800 మంది లష్కర్లను నియమించామని మంత్రి తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టుకు అటవీశాఖ అనుమతులు వచ్చేలా జగిత్యాల కలెక్టర్ ప్రయత్నించాలని, అందుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్, కొండగట్టు ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను చేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రజాస్వామిక స్ఫూర్తితో భూభారతి చట్టం
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజాస్వామిక స్ఫూర్తితో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి కమతానికి ప్రత్యేక నంబర్‌తో భూధార్ కార్డులను అందజేస్తామన్నారు. భూధార్‌కార్డుల్లో భూమి హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబరు పట్టాలు ఉంటాయన్నారు. రెవెన్యూ యంత్రాంగం పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారుల మీద నమ్మకం పెట్టుకొని ఈ పథకాన్ని రూపొం దించామన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశారని అభినందించారు.

రైతు సమస్యలపై కలెక్టర్లు వారి పరిధిలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కలెక్టర్లదే తుది నిర్ణయమని తెలిపారు. అకాలవర్షం కారణంగా పంటనష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయలు పరిహారం కింద 51 కోట్లు విడుదల చేశామన్నారు. ఉమ్మడి జిల్లా మగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నిరంతరం జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

గతంలో రైతులు ఇబ్బందులకు గురయ్యారు..
మంత్రి పొన్నం ప్రభాకర్



గత పాలకుల హయాంలో రైస్ మిల్లుల వద్ద తూకం పేరుతో రైతులు అనేక ఇబ్బందులు గురయ్యారని, ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఇబ్బంది రాలేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మలకపేట, సూరమ్మ, మోతే నారాయణపూర్, గౌరవెల్లి, దేవాదుల వంటి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేదన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

● పలువురు ప్రజాప్రతినిధులు గైర్హాజరు...

కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షా సమావేశానికి ఆరుగురు ఎమ్మెల్యేలు. ఇద్దరు ఎంపీలు గైర్హాజరయ్యారు. కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌కుమార్ గైర్హాజరయ్యారు.

ధాన్యంలో కోత విధిస్తే చర్యలు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: రైస్ మిల్లుల వద్ద ఎక్కడైనా ధాన్యంలో కోత విధిస్తే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు భూ సేకరణ నిధులు వస్తే కుడి ఎడమ కాలువ నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు. వరద కాలువపై 15 కోట్లతో క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వేముల వాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై ప్రభు త్వం దృష్టి సారించిందని, త్వరలో పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు.



● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ డీ 83 కాలువలు పూర్తి స్థాయిలో నీరు రావడంతో రామగుండం ప్రాంతంలో 40 వేల మెట్రిక్ టన్నులకు పైగా పంట దిగుబడి వచ్చిం దని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణానికి సింగరేణికి సంబంధించిన భూములు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బండల వాగు ఎత్తిపోతల పథకం పూర్తయిందని, దీనిని అధికారికంగా ప్రారంభించాలన్నారు. పాల కుర్తి ఎత్తిపోతల పథకానికి నీటి కేటాయింపులు చేసి పూర్తి చేయాలని, పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని కోరారు.



● పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పాలనలో ఎక్కడా కూడా కట్టింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఐదు రోజుల్లో పూర్తవుతాయన్నారు. డీ83, డీ86, డీ89, డీ91 కాల్వలకు సాగు నీటి ఇబ్బంది తీరాలంటే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం జరగాలని అన్నారు.





● చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు వంటి పథకాలు అర్హులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ పనులు 90 శాతం పూరయ్యాయని, భూ సేకరణ కోసం 23 కోట్లు, ప్రాజెక్టు పనులకు 20 కోట్లు విడుదల చేయాలని కోరారు. కొండగట్టు ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు 22 కోట్ల విడుదల చేయాలన్నారు.

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ జిల్లా పరిధిలోని కాలువలు, షట్టర్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. డిజైన్ సమస్య వల్ల దెబ్బతిన్న చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయాలని కోరారు.



● కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఈ సీజన్లో 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మూడు లక్షల 3500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేస్తామని చెప్పారు. మొదటి విడతలో 2,027 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, 990 మార్కింగ్ చేశామని తెలిపారు. 380 గ్రౌండింగ్ పూర్తి చేశామని, 346 ఇళ్ల పేమెంట్లు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో యూరియా ఎరువులు విత్తనాల కొరత లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.



● జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఉన్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు.



● రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రబీ సీజన్‌లో 242 కొనుగోలు కేంద్రాల ప్రారంభించి 2.5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఉన్న రవాణా సమస్య పరిష్కరించామన్నారు. మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లల పూర్తవుతాయని తెలిపారు. 7,800 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.



ఇల్లంతకుంట ఎంపీవోగా అనిల్ కుమార్

ఇల్లంతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా ఎదులాపురం అనిల్ కుమార్ నియమిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పంచాయతీ అధికారిగా పనిచేసిన శ్రీనివాస్ సెలవులో వెళ్లారు. గాలిపెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అనిల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు

ఇల్లంతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని శివాలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాణి అహల్యా బాయి హోల్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా భూత్ అధ్యక్షులు జనగం మాధురి, సందవేని రాజశేకర్‌ల ఆధ్వర్యంలో గురువారం అభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు కొలనూరి ముత్తవ్వ, పిల్లి గోపాల్, కమలాకర్‌రావు, పినకాశి అనీల్, వేముల సువర్ణ, కొత్తపల్లి పద్మ, కిరణ్, కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఇల్లంతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తుందని బీజేపీ సీనియర్‌నాయకుడు దేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకంతో పాటు ప్రస్తుతం పలు రకాలైన పంటలకు కనీస మద్దతు ధర పెంచిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రపంచం మనదేశం వైపు చూస్తోందన్నారు. మద్దతు ధర పెంచడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు.

యువత సరైన మార్గాన్ని ఎంచుకోవాలి

ఇల్లంతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యువత సరైన మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండలంలోని కందికట్కూర్‌లో గురువారం కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు వ్యసనాల బారినపడి జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు ఇస్తున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అత్యవసర పరస్థితి ఏర్పడితే 100 కాల్ చేయాలని సూచించారు. పోలీసులు నిరంతరం ప్రజల సేవలోనే ఉంటారని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులకు పోటాపోటీ

ఇల్లంతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖల అధ్యక్ష పదవులు దక్కించుకోవడానికి తీవ్రంగా పోటీనెలకొంది. మండలంలోని 35 గ్రామశాఖల అధ్యక్ష స్థానాల కోసం ఈనెల 26న నామినేషన్లు స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 155మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కొన్ని గ్రామాల్లో మాత్రమే తక్కువ మంది నామినేషన్లు వేయగా, ఎక్కువ గ్రామాల్లో ఎనిమిది మంది వరకు నాయకులు నామినేషన్లు వేశారు. పదవి తమకు దక్కేలా చూడాలంటూ మండల స్థాయి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండటం, త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ఊహాగానాలు వస్తుండటంతో ఈ పదవులకు పోటీ ఏర్పడింది. కొంతమంది నాయకులు మాత్రమే తమకే గ్రామశాఖ అధ్యక్ష పదవి వచ్చిందని ప్రచారం కూడా చేసుకుంటున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే 'సెస్' లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడమే 'సెస్' లక్ష్యమని డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణహరి మాట్లాడుతూ పల్లెల్లో కరెంటు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెస్ ఏఈ పృథ్వీధర్, తాజా, మాజీ ఎంపీటీసీ అనసూయ, నాయకులు రాంరెడ్డి, గౌస్, శ్రీనివాస్, బాబు, గిరిధర్‌రెడ్డి, నర్సింలు, సంతోష్, తిరుపతి, గోపాల్, సందీప్, కిషన్, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రాజయ్య, ఎల్లయ్య, రాజ్‌కుమార్, సెస్ సిబ్బంది రమేశ్, లక్ష్మీరాజం, ప్రవీణ్, వెంకటేశ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి..

గంభీరావుపేట మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి ఇవ్వాలని జైతెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలో చేపట్టబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు సముచిత స్థానం కల్పించాలన్నారు. వివేక్‌కు మంత్రి పదవి ఇస్తే దళిత సామాజిక వర్గానికి ఎంతో మేలు చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

చందుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించలాని చందుర్తి ఎస్ఐ అంజయ్య అన్నారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో గురువారం వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అంజయ్య వాహనదారులకు ఆటో, జీపు, కార్ల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానాతో పాటు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన ధాన్యం లారీ

చందుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం అనంతపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నుంచి ధాన్యం తరలిస్తున్న లారీ గురువారం దిగబడిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రంలో నీరు నిరువడంతో భూమి బురదమయంగా మారింది. ధాన్యం సంచులతో లారీ లోడ్‌చేసి అనంతరం వెళ్తుండగా బురదలో కురుకపోయింది. రెండు జేసీబీ సహాయంతో దాదాపు రెండు గంటల పాటు శ్రమించి లారీని బయటకు తీశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

రుద్రంగి, 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. నిధులు మంజూరు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగా నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, తర్రే లింగం, ఎర్రం అరవింద్, స్వర్గం పరంధామ్, అశోక్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతంచేయాలని జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జూన్ 13, 14 తేదీలలో జిల్లా నాలుగో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమినేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డిలు హాజరవుతారన్నారు. మండల కేంద్రంలో అనుమతులు లేకుండా భారీపరిశ్రమలు నిర్మించారని, పరిశ్రమల కాలుష్యంతో పంటలకు నష్టం చేకూరుతున్నాయని, ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని, ఆ పరిశ్రమలను మూసివేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మీసం లక్ష్మణ్, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

రాజన్న కోడెల గడ్డిని పరిశీలించిన ఈవో

వేములవాడ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి గోవులు, కోడెలకు భక్తులు అందించిన వరిగడ్డిని ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సమితి సభ్యులు ఆరబెట్టారు. భక్తులు రాజన్న కోడెలకు అందించిన గడ్డి వర్షానికి తడుస్తోందని ఈవో వినోద్‌రెడ్డి పరిశీలించారు. తడవకుండా కొంత మేర వరిగడ్డిని షెడ్డులో, మిగతా గడ్డి వర్షానికి తడవకుండా కవర్‌లతో కప్పిపెట్టారు. కోడెల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు కోడెలకు పచ్చిగడ్డి అందజేస్తున్నామని ఈవో తెలిపారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం..

కోనరావుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని మంగళపల్లిలో సుమారు 65సంవత్సరాలు క్రితం నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం కూలు తోంది. ఐదు సంవత్సరాల క్రితమే ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు అంతకుముందే నిర్మించిన రెండు పాఠశాల భవనాల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. దాదాపు 65 సంవత్సరాల క్రితం మట్టి గోడలతో పాటు బెంగళూరు గూన వేసి నిర్మించారు. చాలామంది పెద్దలకు ఈ భవనం చదువు నేర్చుకున్న సరస్వతీ కోవెల చిహ్నంగా ఉంది. ఇప్పుడు శథిలావస్థకు చేరి కూలుతుండడంతో అదే స్థానంలో అదే మాదిరిగా నిర్మించుకోవాలని గ్రామస్థులు తాపత్రయపడుతున్నారు.

వామ్మో జూన్..



(5వ పేజీ తరువాయి)

ఆరా తీస్తున్నారు. ఖర్చు భారంగా మారిన పిల్లల భవిష్యత్ కోసం వెచ్చించక తప్పదని భావించిన తల్లిదండ్రులు ఖర్చులకు వెనుకాడడం లేదు. సామాన్య, మధ్య తరగతి వారు ప్రైవేటు ఉద్యోగులు ఇందు కోసం కొన్ని నెలల నుంచే తమ ఖర్చులను తగ్గించుకోవడం ఇతర పనుల కోసం డబ్బులను వెచ్చించకుండా వాయిదా వేసుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవడంతోనే ఫీజులు చెల్లించడం ఒక భారం అయితే.. ఇతర ఖర్చులు ఇబ్బందులకు గురిచేస్తాయి. పిల్లలను పాఠశాలలకు పంపించడానికి యూనిఫాం ఇతర సామగ్రి కొనుగోలు కష్టంగా మారుతోంది. పుస్తకాలు, డ్రెస్‌లు, షూలు, సాధారణ దుస్తుల ఖర్చు, బస్సు ఫీజులు ఇలా అనేక విషయాలను తల్లిదండ్రులు లెక్కలు వేసుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో బయట నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు కొనుగోలు ఒప్పు కోరు. పాఠ్యపుస్తకాలు, బ్యాడ్జీలు, పాఠశాలల్లోనే కొనుగోలు చేయడంతో కనీసం ఉద్దెర పొందే పరిస్థితి ఉండదు. యజమాన్యాలు నిర్ణయించిన రేటుకు తీసుకోవడం పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులుపడుతున్నారు.

ప్రతి ఇంటికి అదనంగా రూ 50 వేల ఖర్చు..

జూన్ మాసంలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందటేనే ప్రతి ఇంటిలో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్‌కు టర్మ్‌ఫీజులు, రవాణా, ఇతర ఖర్చులు కలిపితే రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు అవుతుంది. కార్పొరేట్ స్థాయికి వెళ్తే రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి కార్పొరేట్ పాఠశాలలు కూడా రావడంతో పిల్లల చదువుల కోసం మధ్య తరగతి కుటుంబాలు కూడా మొగ్గు చూపుతున్నారు. ఇంజనీరింగ్ చదువాలంటే కూడా కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ మినహాయించిన కళాశాలల ఫీజులు లక్షల్లోనే ఉన్నాయి. మరోవైపు హాస్టల్ ఫీజులు అదనపు భారం ఉంటాయి. ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ ఫీజులు వేలల్లో ఉన్నాయి. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు వసూళ్లు కూడా ఉన్నాయి. పుస్తకాలతో పాటు బ్యాగ్‌లు టిఫిన్ బాక్సుల రేట్లు కూడా మండిపోతున్నాయి.

జిల్లాలో 74,626 మంది విద్యార్థులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 655 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, జడ్పీ హెచ్‌ఎస్, కేజీబీవీ, టీఎస్ఎంఎస్, డీఎన్‌టీ, ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీహెచ్‌ఎస్, ఆర్బీఎస్, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 74,626 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ 240, ఎల్‌కేజీలో 435మంది, యూకేజీలో 670మంది, 1వ తరగతిలో 7,066 మంది, 2వ తరగతిలో 6,844 మంది, మూడవ తరగతిలో 6,490 మంది, 4వ తరగతిలో 7,569, 5వ తరగతిలో 7,333 మంది, 6వ తరగతిలో 7,913 మంది, 7వ తరగతిలో 7,718 మంది, 8వ తరగతిలో 7,842 మంది, 9వ తరగతిలో 7,548 మంది, 10వ తరగ తిలో 6,908 మంది ఉన్నారు. మండలాల్లో చూస్తే బోయినపల్లిలో 2,708 మంది, చందుర్తిలో 3,048 మంది, ఇల్లంతకుంటలో 4,686 మంది, గంభీ రావుపేట 5,701మంది, కోనరావుపేట 4,533 మంది, ముస్తాబాద్‌లో 5,479 మంది, రుద్రంగిలో 2,622మంది, సిరిసిల్లలో 16,457మంది, తంగళ్లపల్లిలో 6,333మంది, వీర్నపల్లిలో 1,455 మంది, వేములవాడ 12,750మంది, వేము లవాడ రూరల్ 1,690 మంది, ఎల్లారెడ్డిపేట 7,169 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులకు బస్సు, యూనిఫాం, బెల్ట్, బ్యాడ్జి, టై, ఐడీ కార్డు, డైరీ, పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ఫీజులు.. ఇలా అన్నింటికి వేలల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కేవలం పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తుండగా, మిగతా నోటు బుక్కులు, ఇతర వాటికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది.

పాఠశాలల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి...

- పాఠశాలకు గుర్తింపు ఉందా లేదా తెలుసుకోవాలి. గుర్తింపు ఉన్నా ఎన్ని తరగతుల వరకు ఉందనే అంశాన్ని కూడా చూడాలి.
- బోధన వివరాలు తెలుసుకోవాలి. అధ్యాపకులు ఎంత వరకు చదువుకున్నారు, టీటీసీ, బీఈడీ ఉందా లేక ఎన్ని సంవత్సరాలు ఏ విద్యా సంస్థలో పని చేశాడో తెలుసుకోవాలి. అనుభవాన్ని కూడా చూడాలి.
- గత ఐదేళ్లలో విద్య సంస్థ సాధిస్తున్న విజయాలు, ఉత్తీర్ణత శాతం చూడాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులకు పాఠశాల యజమాన్యం అందిస్తున్న ప్రొత్సాహం ప్రత్యేకతరగతులపై వాకబు చేయాలి.
- విద్య సంస్థ అద్దె భవనంలో కొనసాగుతుందా? సౌకర్యాలు ఉన్నాయా? పరిసరాలు ఇతర అంశాలను చూడాలి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులతోపాటు గాలివెలుతురు ఎలా వస్తుందో పరిశీలించాలి.
- తాగునీటి వసతి, ప్రయోగశాల, సైన్స్ పరికరాలు, వివిధ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా తెలుసుకోవాలి. ముఖ్యంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం గురించి కూడా తెలుసుకోవాలి.
- పాఠశాల, కళాశాల అయినా క్రీడా మైదానం, పరికరాలు అందుబాటులో ఉన్నాయా? పీఈటీ, పీడీ, ఉన్నారా లేదా తెలుసుకోవాలి. కంప్యూటర్ ల్యాబ్ ప్యాకల్టీ వివరాలు తెలుసుకోవాలి.
- విద్యార్థులను పాఠశాలకు తీసుకొని వెళ్లడానికి బస్సు సౌకర్యం ఉంటే డ్రైవర్ పనితీరు కూడా చూడాలి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒలంపియాడ్, కాన్సెప్ట్, టెక్నో స్కూళ్ల పేరుతో ప్రచారం కూడా చేసుకోవద్దు.
- విద్యార్థులకు యూనిఫాం, నోట్ బుక్కులు ఫలానే చోటనే కొనాలనే నిబంధనలు పెట్టినా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. కలెక్టర్, విద్యా శాఖ అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్లతో కలిసి ఏర్పడిన రెగ్యూలేటరీ కమిటీ నిర్ణయించిన ఫీజులనే చెల్లించాలి. తల్లింద్రులు పాఠశాల గురించి పూర్తి వివరాలను సేకరించిన తర్వాతే పిల్లలను బడిలో చేర్పించడం మంచిది.

వరుస చోరీలతో ఆందోళన

- జిల్లాలో అయిదు నెలల్లో 127 దొంగతనాలు



సిరిసిల్ల క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుసగా జరుగుతున్న చోరీలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. శుభకార్యాలు, వేసవి సెలవులు, తీర్థ యాత్రలకు ఇళ్లకు తాళం వేసి వెళితే చాలు.. దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేసిన సంఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. గత 20రోజులుగా సిరిసిల్ల, వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో తాళం వేసిన ఇళ్లకు దొంగలు కన్నం వేసి అందినకాడికి దోచుకున్నారు. వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట చౌరస్తాలో ఉన్న వైన్‌షాప్‌లో తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. జిల్లాలో గత అయిదు నెలల్లో 127 దొంగతనాలు జరిగాయి. వీటిలో ఎక్కువగా తాళం వేసి ఉన్న ఇళ్లు, షాప్‌లలో దొంగలు చొరబడి దోచుకున్నారు. ఈ సంఘటనల్లో దాదాపు రూ.33.55 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ దొంగతనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దాదాపు 61 దొంగతనాలను ఛేదించి దాదాపు రూ.11.51 లక్షల విలువైన ప్రాపర్టీని రికవరీ చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లకు తాళం వేసి కుటుంబ సభ్యులంతా కలిసి శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలకు తరలివెళితే తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో వేసవి సెలవుల సందర్భంగా వేలాదిమంది పర్యాటక ప్రాంతాలకు, పుణ్యక్షేత్రాలకు, పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు వెళుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు పక్కింటి వారికైనా, స్థానిక పోలీస్ స్టేషన్‌లోనైనా సమాచారం ఇచ్చి వెళ్లాలి. ఇళ్లకు తాళం వేసిన సమయాల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉంది. ఇందుకు తగినజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దొంగలకు ఎక్కువగా మధ్యాహ్నం, రాత్రివేళల్లోనే దొంగతనాలకు సమయం కలిసి వస్తుంది. ఈ సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దొంగలు మధ్యాహ్న సమయాల్లో రెక్కీ చేసుకొని రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతుంటారు. తెరిచి ఉన్న కిటికీలోంచి కర్ర, ఇనుపరాడ్లతో ప్రధాన ద్వారాలను తెరిచి విలువైన వస్తువులను చోరీ చేస్తారు. ప్రధానంగా నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకొని దొంగతనాలకు తెగబడుతారు. ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలు టార్గెట్ చేస్తున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా..

పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నిఘా ఉంటుంది. ప్రతి ఇంటిని సీసీ కెమెరాతో బంధిస్తే ఎలాంటి చోరీలకు అవకాశం ఉండదు. మీ కోసం కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ సీసీ కెమెరాల బిగింపునకు ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. అయినప్పటికీ ప్రజల్లో నిర్లక్ష్యం కారణంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టడంలేదు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఉంటే ఇబ్బంది ఉండదు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు ఫోన్ నంబర్, ఇంటి చిరునామాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి. ప్రధానంగా ఇళ్లకు తాళం వేసే ముందు కిటికీలను పూర్తిగా మూసివేసి బంగారు ఆభరణాలను వెంట తీసుకొని వెళ్లాలి. తాళం బయటకు కనపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లోని నగదు, విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలపై బహిరంగంగా ఎవరికి చెప్పుకోవద్దు. ఇంట్లో ఒంటరిగా ఉండేవారు అనుమానాస్పద వ్యక్తులను లోపలికి రానివ్వకూడదు. మధ్యాహ్నం సమయాల్లో కాలనీల్లో తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ప్రతి ఇంటికీ సీసీ కెమెరాతో ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి చోరీలకు అవకాశం ఉండదు. ఇంట్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఒంటరిగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విలువైన వస్తువులను లాకర్లలో భద్రపరచుకొని వెళ్లాలి. ప్రతి ఒక్కరు స్థానిక పోలీస్‌స్టేషన్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ ఫోన్ నంబర్‌లను దగ్గర పెట్టుకోవాలి. ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో పూర్తి వివరాలు, ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతి ఇంట్లో శునకాలను పెంచుకుంటే భద్రతగా ఉంటాయి.

దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు

- మహేశ్ బి. గీతే, ఎస్పీ



దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీ ముమ్మరం చేశాం. వేసవి సెలవుల సందర్భంగా దొంగతనాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నేను సైతం కార్యక్రమం ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానంగా భావించాలి. ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు టైమర్‌తో కూడిన లైట్లను, అలారంను ఏర్పాటు చేసుకోవాలి.

స్థాయికి మించి విమర్శిస్తే గుణపాఠం తప్పదు

ఎల్లారెడ్డిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తన స్థాయికి మించి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డిలను విమర్శిస్తే గుణపాఠం తప్పదని ఏఎంసీ డైరెక్టర్ రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆగయ్య అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన ఉనికి కాపాడుకునేందుకు సీఎం, ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఇన్‌చార్జిలపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో ఏ హోదాలో అధికారిక కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు ఆగయ్య పాల్గొన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు గౌస్, రాంరెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రవీందర్, గిరిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, రఫీక్, రవి, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ గురించి తెలుసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు మిడిమిడి జ్ఞానంతో ప్రోటోకాల్‌పై రాద్ధాంతం చేయకుండా ఆ విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రజల ఓట్లతో నాలుగు సార్లు ఎన్నికయ్యారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఆయనపై విమర్శలు చేయడం సరైంది కాదని అన్నారు. ఈ సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆ పార్టీ నాయకులు సీత్యానాయక్, తిరుపతినాయక్, పవన్, సుధాకర్‌రావు, బాలునాయక్, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

వీర్నపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జయకుమారి తెలిపారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఏపీఎం నర్సయ్యలతో కలిసి రైతులకు గురువారం పంపిణీ చేశారు. ఈ వానాకాలం సీజన్‌కు సబ్సిడీపై పచ్చి రొట్టె(జీలుగ) విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి 49.50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. 30కిలోల జీలుగవిత్తనాల బస్తా మొత్తం ధర రూ.4,725.50ఉండగా 50శాతం సబ్సిడీ పోగా రూ.2,137 చెల్లించాలన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకవచ్చి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి



టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయుల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని, వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాంనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను జిల్లా అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించాలని పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లులను మంజూరు చేసి విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఉపాధ్యాయుల బాధ్యతల కోసం నిలబడుతూనే హక్కుల కోసం పోరాడే సంఘంగా టీపీటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. న్యాయ పోరాటాల ద్వారా సమ్మె హక్కుని సాధించిన సంఘం టీపీటీఎఫ్ అని, అన్ని ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘాలకు మాతృక అని అన్నారు. 1947లో ఏర్పడిన ఏపీటీఎఫ్, తెలంగాణ ప్రాంతానికి 1983లో వ్యాపించిందని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీపీటీఎఫ్‌గా రూపాంతరం చెందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు పురం వాసుదేవరావు, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగురి దేవేందర్, రజనీరాణి, జిల్లా కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీధర్, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు కదిరె శ్రీనివాస్, వేములవాడ మండల అధ్యక్షుడు బొజ్జ కృష్ణ, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, కోనరావుపేట మండల అధ్యక్షుడు కుమార్, ఇల్లంతకుంట మండల ప్రధాన కార్యదర్శి లౌడ్య శ్రీనివాస్, పోన్నం శ్రీనివాస్, వేణుగోపాల్‌రావు, మధుసూదన్, సుల్తాన్ శ్రీనివాస్, సతీష్, రాంప్రసాద్, భూమేష్, రమేష్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం..





గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేటల్లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించి కేంద్రమంత్రి వర్గ సమావేశంలో తీర్మాణం చేయడం హర్షనీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌లు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాగుల శ్రీనివాస్, బూరవిష్ణు, మోర శ్రీహరి, మహిళా మోర్చాపట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, జిల్లా ప్రధానకార్యదర్శి కర్నే హరీష, ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, చొప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, నరేశ్, సంజీవరెడ్డి, రంజిత్, యాదగిరి, గాల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఆంజనేయులు, గణేశ్, ప్రకాశ్, కృష్ణహరి, రవి, లక్ష్మణ్, బాలాగౌడ్, దయాకర్, కిరణ్‌నాయక్, సాగర్, రవిశంకర్, శ్రీనివాస్, జవహర్‌నాయక్ పాల్గొన్నారు.
- గంభీరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ అధ్యక్షుడు గంట అశోక్, రాజుగౌడ్, సత్యనారాయణ, నాగరాజుగౌడ్, శ్రీనివాస్, నర్సింలు, విగ్నేష్. పర్శాగౌడ్, ఎల్లెందర్, దేవేందర్, స్వామిరాజు, నారాయణ, శంకర్, ప్రశాంత్, నరేష్ ఉన్నారు.
- ముస్తాబాద్ : మండల బీజేపీ అధ్యక్షుడు సౌల్ల క్రాంతి ఆధ్వర్యంలో వివేకనంద కూడలిలో ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్,జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, ఆఫీస్ బెరర్ యెల్ల గిరి, కౌన్సిల మెంబర్ మెర్గు అంజాగౌడ్, రమేశ్‌రెడ్డి రాంగోపాల్, మెంగని మహేందర్, తిరుపతి, గోపి, దీటిసత్తయ్య, ఓరగంటి సత్యం, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.
- వీర్నపల్లి : మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పిట్ల నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. బోడ వెంక టేష్, బానోత్ శ్రీనివాస్, దర్శింగ్, మోహన్, దేవరాజు, మల్లయ్య, అజయ్, పాల్గొన్నారు.
- కోనరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టే రామచంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జింక వెంకటి, బోయిని నర్సయ్య, కస్తూరి జైహింద్ రెడ్డి, రాజేందర్, యాస శంకర్, కాసర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.